ప్రజాశక్తి

శనివారం 13 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

శ్మశాన వాటిక పేరిట నిధులు స్వాహా

గొల్లగుంట శ్మశాన వాటిక

- రూ.8.50 లక్షలు ట్రెజరీలో చెల్లింపులు
- ఎక్కడ ఖర్చు చేశారో తేలని వైనం
- పొంతన కుదరని లెక్కలు
- దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధి శూన్యం
- సరైన రికార్డులు, స్థలానికి రక్షణ కరువు

ప్రజాశక్తి - పరవాడ

అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని గొల్లగుంట శ్మశానవాటిక పేరుతో కొందరు ప్రజల సొమ్ము కాజేశారు. ప్రభుత్వ నిధులు పక్కదారిపట్టాయి. అక్రమార్కులకు అధికార అండదండలు ఉండటంతో నిధుల దుర్వినియోగం పూర్తిస్థాయిలో వెలుగులోకి రావడం లేదు. గ్రామ పంచాయతీలో ఖర్చులకు సంబంధించిన ఎం.బుక్ తదితర రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

మండలంలోని రావాడ పంచాయతీ గొల్లగుంట గ్రామానికి చెందిన శ్మశానవాటిక అచ్యుతాపురం మండలం నునపర్తి పంచాయతీ నడింపల్లి రెవెన్యూ పరిధిలో ఉంది. ఈ శ్మశానవాటిక ఎంతో పురాతనమైనది. సుమారు 300 ఏళ్ళ నాటి సమాధులను నేటికీ ఇక్కడ చూడొచ్చు. ఆ గ్రామంలో ఎవరు చనిపోయినా అదే ప్రాంతంలో ఖననం చేస్తుంటారు. ఇంత పురాతనమైన శ్మశానవాటికకు గ్రామ పంచాయతీ తరపున ప్రభుత్వ నిధులు రూ.లక్షల్లో ఖర్చు చేసినట్లు ఉన్నా.. ఆ తీరున అభివృద్ధి కానరావడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్మశానవాటికలకు రక్షణ కల్పించి, అభివృద్ధి చేయాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2008 అక్టోబర్ 25న జిఒ ఎంఎస్ 1235ని, 2009 జులై 16న జిఒ నెంబర్ 715ను తీసుకొచ్చి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అవేవీ ఇక్కడ కానరావడం లేదు. ఇటు పాలకులు, అటు అధికారుల నిర్లక్ష్యం గొల్లగుంట గ్రామ ప్రజలకు శాపంలా మారింది. ఇటీవల దాతల సహకారంతో శ్మశానవాటిక చుట్టూ పెన్సింగ్ పోల్స్ ఏర్పాటు చేసుకుంటే గుర్తుతెలియని వ్యక్తులు వాటిని ధ్వంసం చేశారు. సంబంధిత స్థలాన్ని ఆక్రమించేందుకే ధ్వంసం చేసి ఉంటారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఆన్‌లైన్ రికార్డులు ఏం చెబుతున్నాయి..?

రావాడ గ్రామ పంచాయతీ తరుపున లక్షల్లో ప్రభుత్వ నిధులు గొల్లగుంట శ్మశానవాటికకు ఖర్చు చేసినట్లు ఆన్‌లైన్ రికార్డులు చూపిస్తున్నాయి. వాటిని 'ప్రజాశక్తి' పరిశీలించగా రావాడ పంచాయతీ క్యాష్‌బుక్‌లో రెండు సార్లు గొల్లగుంట శ్మశానవాటికకు ఖర్చు మిగతా 2లో..

స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

జివిఎంసి స్థాయీ సంఘంలో..

అన్ని అంశాలూ ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి స్థాయీ సంఘంలోని 15 అంశాలు సభ్యుల ఆమోదం పొందాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థాయీ సంఘంలో మొత్తం 15 అంశాలను పొందుపరచగా అన్నీ ఆమోదం పొందాయని వెల్లడించారు. ఒకటి నుంచి 13వ అంశం వరకూ రెవిన్యూ విభాగానికి చెందిన మార్కెట్లు, దుకాణాలు, ఫలసాయాలు, కల్యాణ మండపాలు తదితర అంశాలు ఉండగా, వాటిని సభ్యులు ఆమోదించారన్నారు. 15వ అంశంలో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సింహాచలం ఆర్టీసీ బస్టాండ్ అప్రోచ్ రోడ్డునకు బిటి ప్యాచ్ వర్క్ పనులు చేసేందుకు, ప్రజా ఆరోగ్య విభాగానికి చెందిన కుక్కలకు మిగతా 2లో..

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

వార్త 2లో..

మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఐద్వా సంతకాల సేకరణ

వార్త 5లో..

విశాఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల సత్తా

వార్త 2లో..

ఫిషింగ్ హార్బర్ వద్ద స్నానానికి దిగిన బాలలు

తీరంలో ఆటవిడుపు

విశాఖలో రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు మండిపోతున్నాయి. తీవ్ర ఉక్కబోత నెలకొంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల సంగతి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఏమాత్రం వీలుదొరికినా బావులు, స్విమ్మింగ్‌పూల్స్, సముద్రతీరం వద్ద కనిపిస్తున్నారు. శుక్రవారం పలువురు చిన్నారులు ఫిషింగ్ హార్బర్ వద్ద ఇలా ఈత కొడుతూ సరదాసరదాగా గడపడం కనిపించింది.

ప్రణాళికాయుత బోధనతో ఉత్తమ ఫలితాలు

- విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున
- టెన్త్‌లో 570 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రణాళిక ప్రకారం పాఠశాలల్లో విద్యా బోధన చేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చునని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 570 పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు, పాఠశాలల ప్రధానోపాధ్యాయలకు, తల్లిదండ్రులకు శుక్రవారం మధ్యాహ్నం స్థానిక విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో ఆయన విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చెసిన సభలో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 63 మంది విద్యార్థులు 570కిపైగా మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో జిల్లాను మూడో స్థానంలో ఉంచినందుకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రణాళికతో బోధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. గత ఏడాది విశాఖ జిల్లా ఐదో స్థానంలో నిలవగా, ఈ ఏడాది మూడో స్థానానికి చేరడం గొప్ప విషయమన్నారు. పదో తరగతి తర్వాత ఉన్నత విద్యాభ్యాసం, లక్ష్య సాధనపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలంటే మిగతా 2లో..

టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మొదటి పేజీ తరువాయి..

శ్మశానవాటిక పేరిట నిధులు స్వాహా

చేసినట్లు ఉంది. 2017-18 ఆర్థిక సంవత్సరం నవంబర్‌లో రూ.6 లక్షలా 8 వేలా 59, డిసెంబర్‌లో రూ.2.50 లక్షల నిధులు ఖర్చు చేసినట్లు, ట్రెజరీ నుంచి బిల్లులు చెల్లించినట్లు రికార్డులు ఉన్నాయి. ఇలా పెద్ద మొత్తంలో బిల్లులు పెట్టి దర్జాగా కొంత మంది ప్రభుత్వ నిధులను నాడు స్వాహా చేశారనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి వాస్తవాలు

ఈ శ్మశానవాటికకు ప్రభుత్వం ఖర్చు చేసిన నిధుల వివరాలు, రికార్డులను గ్రామానికి చెందిన ఒకరు సమాచార హక్కు చట్టం దరఖాస్తు ద్వారా కోరగా గ్రామ పంచాయతీ, మండల స్థాయి అధికారులు పొంతన లేని సమాదానాలు ఇచ్చారు. గొల్లగుంట శ్మశానవాటిక అచ్యుతాపురం మండలంలో ఉందని రావాడ గ్రామ పంచాయతీ అధికారులు వివరణ ఇవ్వగా, గొల్లగుంట గ్రామానికి ఆనుకుని ఉందని మండల స్థాయి అధికారులు సమాధానం ఇచ్చారు. 2009లో గ్రామ పంచాయతీ నిధుల నుంచి శ్మశానవాటిక వద్ద బోరును నిర్మించినట్లు, దానికిగానూ రూ.37,142 ఖర్చు చేసినట్లు మాత్రమే తెలిపారు. రూ.లక్షలు ఎటుపోయాయో ఎక్కడా తెలపలేదు. కావాలనే నిధులు, ఖర్చుల వివరాలు అధికారులు తొక్కిపెట్టి ఉంటారని పలువురు భావిస్తున్నారు.

అధికారులు ఏమంటున్నారంటే..

శ్మశానవాటికకు 2015 నుంచి 2019 మధ్యలో ప్రభుత్వం తరపున నిధుల ఏమైనా ఖర్చు చేశారా ? అని మండల పంచాయతీ విస్తరణ అధికారి పి.పద్మజను 'ప్రజాశక్తి' వివరణ కోరగా గొల్లగుంట శ్మశాన వాటికకు మట్టి ఫిల్లింగ్ కోసం పంచాయతీ సాధారణ నిధులు రూ.1,61000 ఖర్చు చేసినట్లు 2017 ఎం.బుక్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. గొల్లగుంట శ్మశానవాటికకు రెండు సార్లు నిధులు ఖర్చు చేసినట్లు ట్రెజరీ నుంచి బిల్లుల చెల్లింపులు ఉన్నాయని ఆన్‌లైన్ క్యాష్ బుక్ నకళ్లను 'ప్రజాశక్తి' చూపించగా ఎం.బుక్ లేకుండా బిల్లులు ఏ విధంగా చెల్లింపులు జరిపారో తెలియదని ఆమె వివరణ ఇచ్చారు.

ఇదే విషయమై ఎంపిడిఒ వి.హేమసుందరరావును వివరణ కోరగా ఇది గ్రామ పంచాయతీ పరిధిలోని అంశమని తెలిపారు. దీనిపై విచక్షణాధికారం, విచారణ అధికారం ఇఒపిఆర్‌డికి ఉంటుందని, అవకతవకలపై పంచాయతీ కార్యదర్శి తప్పు చేసినా, సర్పంచ్ తప్పు చేసినా జిల్లా పంచాయతీ అధికారికి చర్యలు తీసుకొనే అధికారం ఉందని తెలిపారు. తాము కూడా విచారణ జరిపించి వాస్తవాలు నిగ్గుతేలితే చర్యల కోసం జిల్లా పంచాయతీ అధికారికి సిఫార్సు చేస్తామని అన్నారు.

ప్రణాళికాయుత బోధనతో ఉత్తమ ఫలితాలు

ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ప్రణాళికతో చదవాలన్నారు. విద్యార్థులు మంచి ఫలితాల సాధనలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమన్నారు. నిరుపేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు అభ్యసించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యావ్యవస్థలో చేసిన మార్పులు గొప్ప ఫలితాలు తీసుకువస్తున్నాయన్నారు. నాడు - నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామన్నారు. పాస్ పర్సెంటేజ్ తక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రణాళికలు సిద్ధం చేసి, వచ్చే విద్యాసంవత్సరం నాటికి శత శాతం పాస్ పర్సెంటేజ్ నమోదయ్యేలా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. సరైన మౌలిక వసతులు, అనుకూలమైన వాతావరణం కల్పించడం వల్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారని, అవసరమైన పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు రూ.50 వేలు కేటాయిస్తామని తెలిపారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని డిఇఒను ఆదేశించారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులందరూ ఉత్తమ ప్రతిభ కనబరిచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వంద రోజుల ప్రణాళిక అమలు చేశాం : డిఇఒ చంద్రకళ

జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో జిల్లా కలెక్టర్ తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయడం ద్వారానే ఆశించిన స్థాయిలో ఫలితాలు వచ్చాయన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన అత్యధిక మార్కులు శుభపరిణామమన్నారు.

ఆనందపురం కెజిబివి పాఠశాల విద్యార్థిని ఇ.రేవతి మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో తనకు 600కుగాను 585 మార్కులు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఈ మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. మల్కాపురం జివిఎంసి హైస్కూలులో చదువుతున్న పి.మణికంఠ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో 600కిగాను 592 మార్కులు తాను సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల విద్యా బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే తనకు ఇన్ని మార్కులు వచ్చాయన్నారు. అనంతరం మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. అందరితో ముచ్చటిస్తూ సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీదేవి, డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్, జిల్లా లేబర్ అధికారి సునీత, డిఎస్ఒ సూర్యప్రకాష్ రావు పాల్గొన్నారు.

అన్ని అంశాలూ ఆమోదం

ఆహారం, టీకాలు, మందులు కొనేందుకు పరిపాలనపరమైన అనుమతిని కోరగా సభ్యులు ఆమోదించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతోపాటు ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఫణిరామ్, కార్యదర్శి నల్లనయ్య, జోనల్ కమిషనర్లు కనక మహాలక్ష్మి, శివ ప్రసాద్, కార్యనిర్వాహక ఇంజినీర్ సంతోషి, ఎఎంఒహెచ్.కిశోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలన్నింటినీ అమలు చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సీతల్ మదన్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్ర ప్రభుత్వం చేసిన మోసంపై ఆ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తొమ్మిదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఈ విషయంలో కేంద్రాన్ని నిలదీయడంలో పూర్తిగా విఫలమయ్యాయని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో ఏర్పాటైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే అధికారం బిజెపికి లేదని అన్నారు. కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో పార్టీ జిల్లా కన్వీనర్ సాహూ సంతోష్, హరినాథరావు పాల్గొన్నారు.

ఖజానా కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సిఎఫ్ఎంఎస్ కేంద్రంగా కాకుండా విశాఖ జిల్లా ఖజానా కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 84 ద్వారా జివిఎంసి ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ఎంఇఒ ద్వారా జీతాలు డ్రా చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించినప్పటికీ గత నెల జీతాలు, బిల్లులు సమర్పించడంలో తలెత్తిన సాంకేతిక సమస్యలను సిఎఫ్ఎంఎస్ అమరావతి వారు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. తాజాగా భీమిలిలో తలెత్తిన సమస్యను వారు వివరించారు. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి సత్వర సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు చొరవచూపాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

21న అఖిల భారత గిరిజన సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 21న విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత గిరిజన సదస్సును నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు, రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణ మూర్తి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన ఆహ్వాన సంఘం కార్యదర్శి ఎస్.రామ్మోహన్, కోశాధికారి ఎం.లక్ష్మితో కలిసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని విమర్శించారు. ఆదివాసీలకు నేటికీ విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారాయన్నారు. ఈ క్రమంలో ఆదివాసీ చట్టాలు, భూముల పరిరక్షణ కోసం పోరాటాలను ఉధృతం చేసేందుకు ఈ సదస్సు తోడ్పడుతుందన్నారు. సదస్సులో జార్ఖండ్ రాష్ట్ర మహిళా కమిషన్ పూర్వ సభ్యులు వాసవి కిరో, ప్రముఖ న్యాయవాది పల్లా త్రినాథరావు, ఎఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సిఎంఎస్ జిల్లా అధ్యక్షులు డి.లలిత, భారత్ బచావో రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడూరు సీతామహాలక్ష్మి, ఎంఎస్ఎస్ఎస్ నగర కన్వీనర్ ఈసర లక్ష్మి, ఐఎఫ్‌టియు జాతీయ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కె.మల్లయ్య, బానాస జిల్లా అధ్యక్షుడు వై.సూకరాజు, న్యాయవాది కె.పద్మ, భీమ్ సేన వార్ నాయకులు చిన్నారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో..

విశాఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ స్థాయిలో విశాఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారని విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డివైఎస్‌వై.శర్మ అన్నారు. శుక్రవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని ఎంఎస్ఆర్ పిటిఎ టేబుల్ టెన్నిస్ అకాడమీ ఐదో వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో శర్మ

తొలుత జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అకాడమీ క్రీడాకారులను, శిక్షకులను సన్మానించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకుడు కె.కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్థ స్థాపించిన ఐదేళ్లలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో 30 మంది క్రీడాకారులు పాల్గొని విజేతలుగా నిలిచి ప్రతిభ చాటడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. అండర్-11లో జాతీయ స్థాయిలో పదో స్థానంలో నిలిచిన వి.హార్దిక్ జయరాం, రెండు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న వి.సంయుక్త అకాడమీకి గర్వకారణమన్నారు. 20 మంది క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కోణతాల రేవతి రావు, కె.మురళీ పాత్రో, డిఎస్‌సి కోచ్ అచ్యుత్ కుమార్, ప్రధాన శిక్షకులు టి.శ్రీకాంత్ రాజు, ఎం.రవికుమార్, కె.ఉదయభాను వై.రోహిత్ పాల్గొన్నారు.

టెన్త్ సిబిఎస్ఇ ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

విశాఖపట్నం : పదో తరగతి సిబిఎస్ఇ పరీక్షా ఫలితాల్లో శ్రీచైతన్య స్కూలు విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. విశాఖ రామ్‌నగర్ ప్రాంతంలో ఉన్న శ్రీచైతన్య స్కూలులో విద్యనభ్యసించిన కాండ్రేగుల జ్వాలిత 491, వైష్ణవి సిన్హా 488, అవంతిక సింగ్ చందెల్ 487, బమ్మిడి లక్ష్మీ యువరాజ్ 485, మోక్ష రాజగిరి 485, ప్రజిత్‌దాస్ లోపింటి 485 మార్కులు సాధించి ప్రతిభకనబరిచారని శ్రీచైతన్య విద్యా సంస్థల ఉత్తరాంధ్ర ఎజిఎమ్ ఎంవి.సురేష్ తెలిపారు. అంతేగాకుండా 470 మార్కులకుపైగా 49 మంది, 450 మార్కులకుపైగా 91 మంది విద్యార్థులు సాధించారని వెల్లడించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు, రీజియన్ ఇన్‌ఛార్జి ఆలీ అభినందనలు తెలిపారు.

35వ వార్డులో శ్రీ భరత్ పర్యటన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జివిఎంసి 35వ వార్డులో శుక్రవారం టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.శ్రీభరత్ ఆధ్వర్యంలో 'మీకోసం.. మీ భరత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. నీలమ్మ వేప చెట్టు వద్ద ప్రారంభమైన పాదయాత్ర బంగారుమెట్ట, కంఠం వారి వీధి ప్రాంతాల్లో సాగింది. బంగారు మెట్టలో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్ వద్ద కొంతమంది యువకులు నిత్యం గంజాయి సేవిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ ప్రాంతంలో దొంగతనాలు కూడా అధికంగా జరుగుతున్నాయని స్థానిక మహిళలు శ్రీభరత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వార్డులోని ఇంటి గోడలపై 'సైకో పోవాలి - సైకిల్ రావాలి' స్టిక్కర్లు అంటించారు. పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ గండి బాబ్జీ, పార్లమెంటు నియోజకవర్గం ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, వార్డు అధ్యక్షులు బంటుపల్లి సూర్యనారాయణ, బుచ్చా రాముడెడ్డి, సిఎం.రమణ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజినీర్లు, శాస్త్రవేత్తల కృషి అద్వితీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశాభివృద్ధిలో ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు అద్వితీయమని ఐఇఐ ఛైర్మన్ పివిఎస్.గణేష్ కుమార్ అన్నారు. నగరంలోని ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియాలో శుక్రవారం జాతీయ సాంకేతిక దినోత్సవం నిర్వహించారు. ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా ఇండియన్ సొసైటీ ఆఫ్ హీటింగ్, రిఫ్రిజిరేటింగ్ అండ్ ఎయిర్ కండిషనింగ్‌తో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెరుగైన సమాజానికి అందరూ కృషి చేయాలన్నారు. ఇస్రే విశాఖపట్నం చాప్టర్ ఛైర్మన్ యుసిఎం పట్నాయక్ మాట్లాడుతూ భారతదేశం సాంకేతిక పురోగతి కారణంగా అభివృద్ధి దిశగా వెళ్తోందన్నారు. అనంతరం విశాఖపట్నంలోని బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ అడ్వాన్స్ లైట్ వాటర్ రియాక్టర్ హెడ్ పికె మిశ్రాను సత్కరించారు. భారత అణు కార్యక్రమంపై మిశ్రా ప్రసంగించారు. కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, రవీంద్రనాథ్, డాక్టర్ బి.వెంకటరమణ, బింధు మోహన్ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT VISAKHAPATNAM
E.P. 3/2018 in O.S.558 / 2013

Between:
Sadaram Koteswara Rao & 3 others ...DHRs
And:
Rayapureddy Srinivasa Rao & 2 others ...JDRs

NOTICE

JDR No.2. Katamsetty Kumar Babu, S/o. Veera Swamy, R/at D.No. 58-10-44, New Karasa, N.A.D. Post. Visakhapatnam.
JDR No.3. Gumpala Sarath Babu, S/o. Subba Rao, Hindu, R/at D.No. 58-10-44, New Karasa, N.A.D. Post, Visakhapatnam.

పై అమలు పిటీషన్‌లో మీకు పలుమార్లు శ్రీ కోర్టువారి ద్వారా నోటీసులను పంపినను నాటిల్ని ఉద్దేశపూర్వకముగా తీసుకొనక, పై అమలు పిటీషన్ విచారణ తేదిని కూడా శ్రీకోర్టు వారి ముందు హాజరుకాకపోవుటచే శ్రీ కోర్టువారు మీకు నోటీసులను ఈ పత్రిక ప్రకటనద్వారా తెలియజేయమని ఆర్డరు చేసి మీ హాజరీ కొరకు **తేది15-6-2023** నాటికి వాయిదా అయివున్నది కావున పై ఇరువురు ఆదినమున శ్రీ కోర్టివారి ముందు **ఉదయం 10 గంటలకు** మీకు మీరుగానైనా, వకీలుగారి ద్వారాగాని హాజరై మీ అక్షేపణలను అభ్యంతరములను వున్న యెడల శ్రీ కోర్టువారికి తెల్పికొనవచ్చును లేని యెడల పై అమలు మీ పరోక్షమున తీర్మానము అగుననని ఇందు మూలముగా శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు తెలియజేయడమైనది.

(By the Orders of the Court)
D. SURESH KUMAR,
D.(CH.) RENUKA DEVI
Advocates, Visakhapatnam
Mobile: 9648087464.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం

నగదు ప్రోత్సాహకాలు అందించిన మంత్రి నాగార్జున

ప్రజాశక్తి -పిఎం పాలెం : ప్రతి విద్యార్థిలోని నైపుణ్యతను వెలికి తీయడమే జగనన్న లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. శుక్రవారం కొమ్మాదిలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి అభినందించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో అంబేద్కర్ గురుకులాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం అందించే విద్యాపథకాలు సద్వినియోగం చేసుకొని, ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం అందించిన విద్యాపథకాలే, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆసరాగా నిలిచి, ప్రోత్సాహించడం వల్లే ఇలా రాష్ట్రస్థాయి ర్యాంకుల సాధన సాధ్యమైందన్నారు.

గురుకులంలో టాపర్స్‌కు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

అనంతరం అంబేద్కర్ గురుకులాల్లో 589 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానంలో నిలిచిన కాకినాడ గురుకులం విద్యార్థి పి.జోత్స్నకు రూ.లక్ష, 588 మార్కులతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం కొమ్మాది గురుకులం విద్యార్థి యం.ప్రియాంకకు రూ.50 వేలు చెక్కును అందించారు. కార్యక్రమంలో గురుకులాల సెక్రటరీ పావనమూర్తి గారియర్, జాయింట్ సెక్రటరీ శివరావు, డిసిఒలు చంద్రకళ, మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ నాగమణి, స్థానిక నాయకులు వాండ్రాశి రవికుమార్, బొట్ట అప్పలరాజు, సియ్యాద్రి కనకరాజు, కుడితి రామారావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- వేపగుంట : చీమలాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వేపగుంట 11కెవి ఫీడర్‌లో కొత్త డబుల్ సర్క్యూట్ లైన్ వేయనున్నందున ట్రాన్స్‌కో మూడో జోన్ ఆపరేషన్స్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నెల 13న ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎపిఇపిడిసిఎల్ వేపగుంట ఎఇఇ డివి.రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు చీమలపల్లి, పొర్లుపాలెం, శేషాద్రినగర్, ఎంఇఎస్ లేఅవుట్, బ్రహ్మంగారి మఠం, వేపగుంట, పంప్ హౌస్, ముత్యమాంబ కాలనీ, బిసి కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి -కంచరపాలెం : కంచరపాలెం దరి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో వికలాంగులు, సాధారణ అభ్యర్థులకు శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి కల్పనాధికారి సిహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. మొత్తం 13 సంస్థలలో 312 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన జాబ్‌మేళాలో 175 అభ్యర్థులు హాజరు కాగా, అందులో 95 మంది ఎంపికైనట్లు తెలిపారు. వికలాంగ అభ్యర్థులు 92 మంది హాజరు కాగా 63 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు పరిశీలన అనంతరం వచ్చే వారంలో ఉద్యోగ నియామక పత్రాలను సంబంధిత కంపెనీలు అందజేస్తాయన్నారు. అలాగే మరికొందరు అభ్యర్థులకు సంబంధిత జాబ్‌లకు అవసరమైన ప్రాథమిక శిక్షణ ఇచ్చి, 15 రోజుల్లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీఉద్యోగ ఆశావాదులకు స్కేటన్లు పంపిణీ చేశారు. వికలాంగులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వీల్ చైర్లు అందజేసింది.. విశాఖ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ ప్రతినిధులు చలివేంద్రం ఏర్పాటు చేసి, మజ్జిగ పంపిణీ చేశారు.

హెచ్‌సిఎల్ టెక్‌బి జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి -కంచరపాలెం. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌సిఎల్ సంస్థ సౌజన్యంతో నిర్వహించిన టెక్‌బీ ప్రవేశాలకు నిర్వహించిన జాబ్ డ్రైవ్‌లో 11 మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. ఇంటర్‌లో కనీసం 75శాతం మార్కులతోపాటు ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా 75మంది పాల్గొనగా, 11మంది ఇంటర్వ్యూకు అర్హత సాధించారు.కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య, హెచ్‌సిఎల్ మేనేజర్ యు.అనిల్, క్లస్టర్ మేనేజర్ సాయికిరణ్, యుగేష్, విట్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్ పట్నాయక్, టిపిఒ డాక్టర్ ఆడారి తులసినాయుడు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మల్లా రమేష్‌నాయుడు, డెడికేటెడ్ ఇఎస్ కోఆర్డినేటర్లు బండారు రామేశ్వరి, కాళ్లసంతోష్ పాల్గొన్నారు.

ఫ్యాబ్రికేషన్ పెయింటింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : మహిళల స్వయం ఉపాధికి ఫ్యాబ్రికేషన్ పెయింటింగ్‌పై శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని బాలవికాస ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. శుక్రవారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరంలో బాల వికాస ఫౌండేషన్ వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా ఫెవికాల్ సంస్థ సహకారంతో మహిళలకు ఐదు రోజుల శిక్షణను ప్రారంభించారు. వర్క్‌షాప్ డైరెక్టర్ యామిని మాట్లాడుతూ, శిక్షణలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారుఉ 85200 04288 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కోటేశ్వరరావు, రమణ, డాక్టర్ బాబ్జి, అనురాధ పాల్గొన్నారు

మలేరియా నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : దోమలను నియంత్రించడం ద్వారా మలేరియా, డెంగీ, ఇతర దోమ కారక వ్యాధులను అరికట్టవచ్చని జిల్లా మలేరియా నివారణాధికారి డాక్టర్ మణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో మలేరియా నిర్మూలనపై అవగాహన కల్పించారు. నీటి నిల్వలోనే దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందుతాయని, ఇంటి లోపల, పరిసరాల్లో మురుగు,మంచినీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఎపిఎం బి.రంగారావు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు

హత్యకేసుపై సమగ్ర విచారణ జరపాలి

సిఐ లక్ష్మణమూర్తికి వినతి పత్రం అందజేస్తున్న రాము

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటోవార్డు బాలాజీ నగర్, యాత పేటకు చెందిన రీసు గోపి అనే మహిళ దారుణహత్యపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము,బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సిఐ కె.లక్ష్మణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. నిందితుడు చేపలుప్పాడ పాతూరుకు చెందిన ఆటోడ్రైవర్ మైలపల్లి రాజుపై గతంలోనూ పలువురు యువతులు, మహిళలను మోసగించిన నేరచరిత్ర ఉందన్నారు. రాజు ఒక్కడే ఈ ఘాతుకానికి ఒడిగట్టాడా? లేక ఇంకెవరి సహకారం తీసుకున్నాడో విచారణ తేల్చి కఠినంగా శిక్షించాలని కోరారు.బాధిత కుటుంబాన్ని ఆదుకోవడంతోపాటు ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

నేరాలు ఘోరాలు

గుండెపోటుతో ఎస్ఐ మృతి

ప్రజాశక్తి -కంచరపాలెం : ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వాసుదేవరావు శుక్రవారం షీలానగర్‌లోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. షీలానగర్ ప్రాంతానికి చెందిన వాసుదేవరావు, 1983లో పోలీసుశాఖలో చేరారు. నాటి నుండి అనేక పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించిన ఆయన ప్రస్తుతం ఎయిర్ పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఇంట్లోనే హఠాత్తుగా గుండెపోటు రావడం, మృతిచెందడం జరిగిందని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలిసిన వెస్ట్ సబ్‌డివిజన్ ఎసిపి అన్నెపు నర్సింహామూర్తి, ఎయిర్‌పోర్టు పోలీసుస్టేషన్ సిఐ బిఎండి ప్రసాద్, ఇతర సిబ్బంది వాసుదేవరావు భౌతికకాయానికి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించారు.


ఎస్ఐ వాసుదేవరావు (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని దుక్కవానిపాలెం చెక్‌పోస్ట్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్ ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం పాలయ్యాడు. అనకాపల్లి జిల్లా, కె.కోటపాడు మండలం, చంద్రయ్య పేట గ్రామానికి చెందిన గవిరెడ్డి దేముడు (47), గొలుగొండ పోలీస స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా విశాఖపట్నం లోని తన స్నేహితుడి కారులో వస్తూ, దుక్కవానిపాలెం హైవే చెక్ పోస్ట్ దగ్గర కారు అపి, మంచినీరు బాటిల్ కొనుక్కుని తిరిగి కారు ఎక్కుతుండగా, వెనుక నుంచి వస్తున్న మినీ వ్యాన్ అదుపు తప్పి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రగాయాలైన దేముడును తగరపువలస ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృత్యువాత పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.మృతుని సోదరుడు గవిరెడ్డి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గవిరెడ్డి దేముడు (ఫైల్‌ఫొటో)

వైభవంగా కుంతీమాధవస్వామి చందనోత్సవం

ప్రజాశక్తి-పద్మనాభం : పద్మనాభంలోని అనంతుని దేవస్థానం సన్నిధిలో ఉన్న కుంతీమాధవస్వామి అలయంలో కుంతీమాధవస్వామికి తొలి చందనోత్సవం శుక్రవారం అంగరంగవైభవంగా జరిగింది. వేకువజామునే కుంతీమాధవస్వామి మూలవిరాట్‌నకు వేద పండితులు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తీసుకొచ్చిన చందనాన్ని స్వామికి అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

కార్యక్రమంలో ఎంపిపి కె రాంబాబు, మాజీ ఎంపిపి డి గోపాలకృష్ణ మూర్తిరాజు, జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు, మాజీ జెడ్‌పిటిసి కె దామోదరరావు, తహశీల్దార్ తోట శ్రీవల్లీ ఆర్ రవికుమార్ పాల్గొన్నారు.

అండర్ పాత్‌వే పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఆనందపురం : వెల్లంకి గ్రామంలో జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లేందుకు వీలుగా అండర్ పాత్ వే నిర్మాణ పనులకు శుక్రవారం ఎంపిపి శారద ప్రియాంక, జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.10లక్షలతో ఈ పనులు చేపట్టనున్నారు.

కార్యక్రమంలో వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎఎంసి చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపిపి బొట్ట రామకృష్ణ ధనలక్ష్మి, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వైసిపి నేతలు కాకర వెంకటరమణ, పిన్నింటి వెంకటరమణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె. చంద్రమౌళి, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, ఎంపిటిసి పడాల అప్పలనాయుడు, పడాల రాము, తోనంగి అప్పారావురెడ్డి, దామోదరరావు, కుర్రాయి సూరిబాబు, రిటైర్డ్ టీచర్ గోలి రాంబాబు, భావన రమణ, గోలి సతీష్ పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తిదారులకు నైటింగేల్ మార్గదర్శి

ఘనంగా ప్రపంచ నర్సుల దినోత్సవం

ఫ్లోరెన్స్ నైటింగేల్‌కు నివాళులర్పిస్తున్న గీతం సిబ్బంది

ప్రజాశక్తి- మధురవాడ : సేవా దృక్పథంతో రోగులను అక్కున చేర్చుకుని పనిచేసిన ఫ్లోరెన్స్ నైటింగేల్ మానవత్వానికి మరో పేరుగా నిలిచారనిగీతం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ అన్నారు. నర్సింగ్ వృత్తిలో ఉన్న వారికి నైటింగేల్ సేవలు మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. శుక్రవారం ప్రపంచ నర్సుల దినోత్సవం. ఫ్లోరెన్స్ నైటింగేల్ 203వ జయంతి సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆవరణలోని కోకిల సదన్ బాలికల వసతి గృహంలో ఫ్లోరెన్స్ నైటింగేల్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మానవ సేవే మాధవ సేవ పరమావధిగా గీతంలో వైద్యసేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఉత్తరాంధ్ర ప్రాంతంలో గీతం నర్సింగ్ వృత్తిదారులు ప్రశంసాపూర్వక సేవలు అందించారన్నారు. రోగులకు వైద్యసేవలు సంతృప్తి కరంగా అందించడంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. కార్యక్రమంలో గీతం నర్సింగ్ కళాశాల విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సులకు ఘన సత్కారం

ఆరిలోవ : అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విమ్స్ ఆసుపత్రిలో శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని నిర్వహించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యరంగంలో నర్సుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. రోగులకు మెరుగైన సేవలందించడంలో నర్సులకు ఎవరూ సాటిరారన్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న నర్సింగ్ ఇన్‌ఛార్జి రాధ, స్టాఫ్ నర్సు వి.జ్యోతి, కల్యాణ్, తిరుమల, దుర్గ తదితరులను సత్కరించారు.

ఎంవిపి.కాలనీ : వారం రోజులుగా ఎయులో జరుగుతున్న ఇంటర్నేషనల్ నర్సెస్ వీక్ శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో ఆంధ్రా యూనివర్సిటీ సర్ సిఆర్.రెడ్డి కాన్వోకేషన్ హాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సులు సమాజానికి ఎంతో సేవచేస్తున్నారని కొనియాడారు. ఎయు విసి ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ రెహమాన్, నెడ్ క్యాప్ చైర్మన్ కెకె.రాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు

నర్సులను సత్కరిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

పోస్టుకార్డు ఉద్యమాన్ని జయప్రదం చేయండి

మాట్లాడుతున్న సుధాకర్

ప్రజాశక్తి -కంచరపాలెం : ఇపిఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోడీకి రాసే పోస్టుకార్డు ఉద్యమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిటి మూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఎన్ఎడి దరి శాంతినగర్ హస్మి భవన్‌లో బిటి మూర్తి అధ్యక్షతన నిర్వహించిన పెన్షనర్ల అసోసియేషన్ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.కె.హుస్సేన్ మాట్లాడుతూ ఆల్ ఇండియా పెన్షనర్ల కోఆర్డినేటివ్ కమిటీ నిర్ణయం ప్రకారం పోస్ట్‌కార్డ్ ఉద్యమంలోఅందరూ పాల్గొనాలని కోరారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కె సుధాకరరావు మాట్లాడుతూ ఆల్ ఇండియా కోఆర్డినేటివ్ కమిటీ సమావేశం వచ్చేనెల 27న శేగాన్‌లో జరుగుతోందని, సమావేశానికి వచ్చే కార్యకర్తలు తమ పేర్లను నమోదు చేసుకోవడంతో పాటు అక్కడి వెళ్లేందుకు ఇప్పుడే రైల్వే టిక్కెట్లను రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పెన్షనర్ల తాజా పరిస్థితులు, ప్రస్తుత రాజకీయాల పరిస్థితి విపులంగా వివరించారు.హయ్యార్ ఆప్షన్ ఆన్‌లైన్ చేసుకోవడంపై సమగ్రంగా వివరించారు. పోస్టు కార్డు ఉద్యమం అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఘనంగా పల్లా జన్మదిన వేడుకలు

పల్లాకు జన్మదిన శుభాకాంక్షలుచెబుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- మాధవధార :తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పల్లా జన్మదిన వేడుకలలో పాల్గొన్న ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిక్కాల విజయబాబు, 51వ వార్డు నేత ససపల కీర్తి, రాష్ట్ర కమిటీ సభ్యుడు కొట్టా కార్తీక్, ఎస్‌సి సెల్ జనరల్ సెక్రెటరీ జయరాజు, జిల్లా కార్యదర్శి కోయిలాడ వెంకటేష్, జిల్లా కార్యదర్శి బొడ్డేపల్లి లలిత, బిసి సెల్ వైస్ ప్రెసిడెంట్ మూల అప్పారావు, 51వ వార్డు సెక్రెటరీ పేటాడ మధుసూదనరావు తదితరులు పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో పాల్గొని, పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గాజువాక : టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు శుక్రవారం గాజువాక పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని వివిధ వార్డులకు చెందిన నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు దుశ్శాలువాతో పల్లా శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.

ఉక్కు డైరెక్టర్ పర్సనల్‌కు అభినందనలు

స్టీల్ డైరెక్టర్ పర్సనల్ సురేష్ చంద్రను అభినందిస్తున్న ఇంటక్ నేతలు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ సురేష్‌చంద్ర పాండేను ఐఎన్‌టియుసి నేతలు నీరుకొండ రామచంద్రరావు, మంత్రి రాజశేఖర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు వేతన ఒప్పందం జరగక ఎంతో మానసిక వేదనకు గురౌతున్నారని, త్వరితగతిన వేతన ఒప్పందం అమలు జరిగేలా చూడాలని కోరారు. మానవ వనరులను సక్రమంగా నిర్వహిస్తూ, స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనిపై డైరెక్టర్ పర్సనల్ సురేష్‌చంద్ర స్పందిస్తూ, కార్మికులు, యూనియన్లు, యాజమాన్యం కలిసి పనిచేస్తేనే కర్మాగారం లాభాల బాటలో పయనిస్తుందన్నారు.కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నేతలు కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, నాయక్, సుబ్బయ్య, కొమ్ము ప్రసాద్, గోపిశెట్టి వెంకటరమణ, ప్రభాకరరెడ్డి, పి.వి.రమణమూర్తి, రవి, జెర్రిపోతుల మోహన్‌కుమార్, సుదర్శన్, వెంకటరాజు, వేణువర్మ, దేముడు, ఎం.ఎస్ ప్రసాద్, సుబ్బరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

43వ వార్డులో గడపగడపకూ...

ప్రజాశక్తి- సీతమ్మధార : జీవిఎంసి 43వ వార్డు అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్, శ్రీనివాస నగర్ ప్రాంతాల్లో వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్ కె.కె రాజు, స్థానిక కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథక బ్రోచర్ ఇస్తున్న కె.కె.రాజు

మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు

మద్దిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మొక్కజొన్న కొనుగోలు ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి-పద్మనాభం : మద్దతుధరకు మొక్కజొన్న పంటను కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తామని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మద్ది రైతు భరోసా కేంద్రం వద్ద రబీలో పండించిన మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న కొనుగోలుకు మండలంలో మద్ది, బాందేవుపురం, పొట్నూరు, కృష్ణాపురం గ్రామాల్లో ప్రభుత్వపరంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. క్వింటా మొక్కజొన్నకు నిబంధనల మేరకు రూ.1962 చెల్లించి, కొనుగోలు చేస్తామన్నారు. మొక్కజొన్న సొమ్మును మార్క్‌ఫెడ్ ద్వారా సంబంధిత రైతులకు ఖాతాలకు ఆన్‌లైన్‌లో జమ చేస్తామని వెల్లడించారు. అందరి రైతుల నుంచి మొక్కజొన్న సేకరిస్తామని, ఈ ఏడాది 20వేల క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుగత సన్యాసమ్మ, ఎంపిపి కె రాంబాబు, జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు, ఎడిఎ బొడ్డేపల్లి విజయప్రసాద్, ఎఒ ఎవి చలం, తహశీల్దార్ తోట శ్రీవల్లి, ఎంపిడిఒ ఎం.విజయకుమార్, వైసిపి మండలపార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం స్థానిక కుంతీమాధవస్వామి ప్రథమ చందనోత్సవం సందర్భంగా స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి- వేపగుంట :ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయొచ్చని మాజీ మంత్రి, టిడిపి నేత బండారు సత్యానారాయణమూర్తి అన్నారు. శుక్రవారం వేపగుంటలో మాజీ సర్పంచ్ గంట్ల పెంటారావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా, ఆయన కుమారుడు, టిడిపి 94వ వార్డు అధ్యక్షుడు గంట్ల దివాకర్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ, పెంటారావు సర్పంచ్‌గా వేపగుంట అభివృద్ధికి, అలాగే టిడిపి బలోపేతానికి కృషి చేశారన్నారు. ఆయన వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో 88, 93, 94వార్డుల టిడిపి కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, మొల్లి ముత్యాల నాయుడు, శానాపతి శంకరరావు, 96వ వార్డు కార్పొరేటర్ దొశెట్టి అప్పారావు, చుక్క కృష్ణ, వేణు, కిరణ్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ హుస్సేన్

ప్రజాశక్తి- పెందుర్తి : స్పందనలో స్వీకరించిన అర్జీలకు సత్వరమే పరిష్కార చర్యలు చేపట్టనున్నట్లు ఆర్‌డిఒ హుస్సేన్ అన్నారు. గురువారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ రెవిన్యూ సంబంధిత సమస్యలకు అధికారుల సమక్షంలో సత్వరమే పరిష్కార మార్గం దొరుకుతుందన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను కూడా వెంటనే పరిశీలించి, పరిష్కారం చేస్తామన్నారు. ప్రజలు స్పందనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆనందకుమార్ పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే మళ్ల

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను శుక్రవారం మాజీ శాసనసభ్యులు మళ్ల విజయప్రసాద్ దంపతులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభం ఆలింగనం చేసుకొని, బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేసి. స్వామి అంతరాలయం, గోదాదేవి సన్నిధిలో గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదించగా , అధికారులు స్వామి ప్రసాదాన్ని అందించారు.

మేయర్ దంపతులకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - ఆరిలోవ : గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తన తొమ్మిదేళ్ల కుమారుడు మణికంఠ వైద్యానికి ముఖ్యమంత్రి.జగన్మోహన్ రెడ్డి సహాయం అందించేలా సహకరించిన మేయర్ దంపతులు గొలగాని హరి వెంకట కుమారి, శ్రీనివాస్‌లకు బాధిత బాలుని తల్లి వానపల్లి పార్వతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఉదయం మేయర్ క్యాంపు కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి జగన్ విశాఖ పర్యటన సందర్భంగా నత బిడ్డ వైద్యసాయం కోసం ముఖ్యమంత్రిని కలిసేందుకు మణికంఠ తల్లి రోడ్డుపైనే వేచియున్న సందర్భంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన వాహనాన్ని ఆపి, బాలుని అనారోగ్య సమస్య, వైద్యానికి అయ్యే ఖర్చు, ఇతర వివరాలను తెలుసుకొని, మణికంఠ వైద్యానికి అయ్యే మొత్తం ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని భరోసానివ్వడంతోపాటు వెంటనే తక్షణసాయం రూ.లక్ష చెక్కును అందించారు. అయితే ముఖ్యమంత్రిని తాము కలిసేందుకు సహకరించిన మేయర్ దంపతులకు బాధిత కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

చీరల పంపిణీ

పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న అప్పారావు దంపతులు

ప్రజాశక్తి -గాజువాక : ఎపి స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు అండిబోయిన అప్పారావు, లక్ష్మి పెళ్లిరోజు సందర్భంగా శుక్రవారం ఉడా కాలనీలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఉక్కు అధికారుల పాల్గొని పేదలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కోక్ వన్ డిపార్ట్‌మెంట్ డిజిఎం ఎంవివి సత్యనారాయణ, సిఆర్‌జి డిపార్ట్‌మెంట్ ఎజిఎం నమ్మి తాతారావు, డిఎన్‌డబ్ల్యు ఎజిఎం అండిబోయిన అప్పారావు, సీనియర్ మేనేజర్ జి గణేష్, కెపి.రాజు, మళ్ల సూర్యనారాయణ, ఎన్‌వి. రమణ, ఎన్ రాజు, ఎస్‌విఎస్ మూర్తి, పైడికొండ, అధిక సంఖ్యల మహిళలు పాల్గొని అప్పారావు దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

'ఆపిల్ ఐ' స్కూల్ ప్రభంజనం

సిబిఎస్‌ఇ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత

విద్యార్థిని అభినందిస్తున్న 'ఆపిల్ ఐ' స్కూల్ ఛైర్మన్ బలరామకృష్ణ

ప్రజాశక్తి -గాజువాక : సిబిఎస్‌ఇ పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీనగర్‌కు చెందిన 'ఆపిల్ ఐ' ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ ఛైర్మన్ బలరామకృష్ణ తెలిపారు. మొత్తం విద్యార్థులు 54మంది పరీక్షకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని, వీరిలో 51 మంది ప్రథమశ్రేణిలో పాసయ్యారన్నారు. వీరిలో 90 శాతానికి పైగా మార్కులు 13 మంది విద్యార్థులు సాధించారన్నారు. గడచిన ఎనిమిదేళ్లలో అత్యుత్తమ ఫలితాలను ఈ ఏడాది సాధించడంపై ఛైర్మన్ హర్షం వ్యక్తం చేసి, విద్యార్థులను అభినందించారు.

శివాలయానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు ఫైనాపిల్ కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలోని విజయ గణపతి అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం యాగశాలకు ఉపకార ఛారిటబుల్ ట్రస్టు అధినేత కంచర్ల అచ్యుతరావు రూ.ఒక లక్ష విరాళాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉపకార ఛారిటబుల్ సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న అధినేత కంచర్ల అచ్యుతరావు, తమ శివాలయం యాగశాలకు ఆర్థికసాయం అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపకార సంస్థ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు సుధీర్, నాగరాజు, భాస్కర్, ధనరాజు, శివ పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఐద్వా సంతకాల సేకరణ

బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్, హర్యానా మంత్రి సందీప్‌సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

భారత స్టార్ మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బిజెపి ఎంపీ, రెల్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్‌ను, ఓ జూనియర్ అథ్లెటిక్స్ మహిళా కోచ్‌ను లైంగికంగా వేధించిన హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, వారిని పదవుల నుండి బర్తరఫ్ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న నిరసన కార్యక్రమానికి మద్దతుగా శుక్రవారం ఐద్వా నాయకులు స్థానిక అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ లైంగిక వేధింపులపై మహిళా మల్లయోధులు 2023 జనవరిలో ఢిల్లీలో నిరసన తెలియజేశారని, నాడు దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కేంద్రం ఆ దిశగా చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొనే వరకు ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణమన్నారు. బ్రిజ్ భూషణ్ అధికార బిజెపి ఎంపీ కావడంతో నిందితులను రక్షిస్తుందని విమర్శించారు. ఇదంతా చాలదన్నట్టు బ్రిజ్ భూషణ్ రెజ్లర్లను భయపెట్టి బెదిరించారని తెలిపారు. ఆయన వల్ల తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని రెజ్లర్లు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెంటనే బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని, నిరసన తెలుపుతున్న మహిళా మల్లయోధులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.మాణిక్యం, ఎస్.అరుణ, సంయుక్త కార్యదర్శి కె.ప్రసన్న, ఉపాధ్యక్షులు కెవి.సూర్యప్రభ, ఐద్వా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ చేస్తున్న ఐద్వా నాయకులు

గూడు గాయత్రి, ఆడారి ప్రణిత, నడిశెట్టి దీప్తి

సిబిఎస్ఇలో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : సిబిఎస్ఇ పది ఫలితాల్లో 44 మంది సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరులో గూడు గాయత్రి 470, ఆడారి ప్రణిత 465, నడిశెట్టి దీప్తి 459 మార్కులు సాధించారు. మరో 41 మంది మంచి ఫలితం సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన వారికి స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబొల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ మహేష్ అభినందించారు.

విద్యార్థి హేమశ్రీని సత్కరించి అభినందిస్తున్న డిప్యూటీ సిఎం బూడి

హేమశ్రీకి డిప్యూటీ సిఎం బూడి అభినందన

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండలంలోని కొత్తపెంట గ్రామానికి చెందిన కామిరెడ్డి హేమశ్రీ ఇటీవల విడుదలైన పది ఫలితాలలో 594 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు శుక్రవారం ఆమెను అభినందించారు. రాష్ట్ర పరీక్షల డైరెక్టర్ గట్టు దేవానంద రెడ్డి రూ.5వేలు నగదును అందజేసి సాలువుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్ రవీంద్రబాబు, సర్పంచ్ రొంగలి వెంకటరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి గవర్ల అనకాపల్లి సమస్యలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావుతో కూడిన బృందం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. గవర్ల అనకాపల్లి ఆవ కాలువపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయి పదేళ్లు కావస్తున్న నేటికీ అప్రోచ్ రోడ్డు వేయలేదన్నారు. దీంతో నిరుపయోగంగా ఉండి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని తెలిపారు. అనకాపల్లి బైపాస్ నుండి తోటాడ సెంటర్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టి ప్రమాదాలను అరికట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం నిర్మించాలని, అసంపూర్తి వదిలేసిన రైతు భరోసా కేంద్రం నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్షాలు కురిసినప్పుడు శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతున్నామని, బిల్డింగ్, ప్రహరీ నిర్మించాలని, మురుగునీటి కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెంటకోట జోగినాయుడు, కాండ్రేగుల రాము, వైసిపి నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రమణమూర్తిరాజుకు సమస్యలు వివరిస్తున్న దృశ్యం

జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ ప్లాట్లు సిద్ధం

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి తదితరులు

ప్రజాశక్తి - అనకాపల్లి

జిల్లాలోని అచ్యుతాపురం మండలం చోడపల్లి, భోగాపురం గ్రామాల్లో 16.50 లక్షలు, రూ.22 లక్షలు, రూ.26.40 లక్షలు ఖరీదులో 3రకాల 183 ఎంఐజి ప్లాట్లు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి వెల్లడించారు. కలెక్టరేట్లో శుక్రవారం ప్లాట్ల అమ్మకాలు, వెబ్ సైట్ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మధ్య ఆదాయ వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా అచ్యుతాపురం పిసిపిఐఆర్‌లో విఎంఆర్‌డిఎ ఈ ప్లాట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతం అనకాపల్లికి 16, విశాఖకు 36 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉందన్నారు. మధ్య ఆదాయ తరగతుల వారికి అందుబాటులో ఉండే విధంగా ఎంఐజి ప్లాట్లు సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రజలు ఉద్యోగ వ్యాపార రంగాల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వికెపిసిపిఐఆర్ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి వెంకటరావు, విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రవీంద్ర, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, నోడల్ అధికారి శిల్ప, డిప్యూటీ డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని కుదించడానికి కేంద్రం కుట్ర

ప్రజాశక్తి- కె.కోటపాడు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కుదించుటకు కుట్ర చేస్తుందని ఎపి రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయిని బాబు అన్నారు. అందుకే పథకానికి ప్రతి ఏటా మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ వస్తుందని తెలిపారు. ఈ కుట్రను ఉపాధి హామీ కూలీలందరూ కలసికట్టుగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఉపాధి కూలీలతో ఆయన సమావేశమై మాట్లాడారు. వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో కూలీలకు వచ్చిన ఆదాయం చాలక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి రూ.600 ఇవ్వాలని, సంవత్సరానికి 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని జరిగిన 15 రోజుల్లో పేమెంట్లు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, ఉపాధి మెట్లు, కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శ్రీనివాసరావు

ఉపాధి హామీ కూలి రేట్లు, పని దినాలు పెంచాలి

కసింకోట : ఉపాధి హామీ చట్టం కింద పనులు చేస్తున్న కూలీలకు కూలిరేట్లు, పని దినాలు పెంచాలని సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎం.శ్రీదేవి, కె.శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సిఐటియు నాయకులు శుక్రవారం సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చర్యలు ప్రయత్నాలు మానుకోవాలని, దీనికి బడ్జెట్లో నిధులు పెంచాలని కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల పని ప్రదేశంలో ఒక ఆరోగ్య కార్యకర్తను నియమించాలని, మజ్జిగ మంచినీటి, టెంట్లు వంటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వేసవి అలవెన్స్, పనిముట్లకు డబ్బులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.మంగ, జి.అమ్మాజమ్మ, లక్ష్మి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జాతీయ సాంకేతిక దినోత్సవంలో డైట్‌కు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఎన్ఎస్‌టిఎల్‌లో మూడు రోజులుగా జరిగిన సాంకేతిక దినోత్సవం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ డివిఎల్ఎన్ సోమయాజులు, డాక్టర్.జిఎన్ రావు, ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనకు 96 ప్రాజెక్టులు రిజిస్టర్ కాగా 43 ప్రాజెక్టులు మాత్రమే పోటీల్లో పాల్గొన్నాయి. డైట్ కళాశాలకు చెందిన లైట్ ట్రాన్స్మిట్టింగ్ కాంక్రీట్ బ్రిక్ శాస్త్రవేత్తల మన్ననలు పొందడమే కాకుండా పోటీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా నరసింహం, చైర్మన్ దాడి రత్నాకర్ మట్లాడుతూ దేశంలో ఉన్న ఐఐటి, ఎన్ఐటిలకు దీటుగా పోటీ ప్రపంచాన్ని తమ కళాశాల విద్యార్థులకు ముందు నుండి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సివిల్ విభగాధిపతి ఎన్.రాము మాట్లాడుతూ ఒకే ప్రాజెక్ట్‌కు పేటెంట్, జెఎన్‌టియు గతేడాది నిర్వహించిన యునివర్సిటీ లెవెల్‌లో మొదటి బహుమతి, ఇప్పుడు ఎన్ఎస్‌టిఎల్ నిర్వహించిన పోటీలో ప్రథమ బహుమతి రావడం గర్వంగా ఉందన్నారు. డైట్ ఆర్ అండ్ డి కోఆర్డినేటర్ నళిని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు కేంద్రానికి చెంప పెట్టు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఢిల్లీలో పాలన అధికారాలు ఢిల్లీ ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుందని ఈ నెల 11న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చెంపపెట్టు అని ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొణతాల హరినాథ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎనిమిది సంవత్సరాల ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం చేసిన న్యాయపోరాటం మోడీ ప్రభుత్వం, గవర్నర్ మీద విజయం సాధించడం తెలిపారు. ఐఎఎస్‌లను, అధికారులకు బదిలీ చేసే అధికారం గవర్నర్‌కు లేదని తీర్పు ఇవ్వడం కేంద్రానికి ఒక గుణపాఠమని పేర్కొన్నారు.

కూలింగ్ హెల్మెట్ రూపకల్పన

ప్రజాశక్తి-అనకాపల్లి : ద్వీచక్రవహనదారుల కోసం కూలింగ్ హెల్మెట్‌ను అనకాపల్లి డైట్ కళాశాల విద్యార్థులు తయారు చేశారు. వేసవి కాలంలో చిరు వ్యాపారులకు కూడా ఈ హెల్మెట్ ఎంతగానో ఉపయోగ పడుతుందని ప్రాజెక్ట్ ఇంజినీర్ బి.శేషగిరిరావు తెలిపారు. హెల్మెట్, కూలింగ్ ఫ్యాన్, 12 ఓల్టేజ్ బ్యాటరీ, ఆన్ ఆఫ్ స్విచ్ దీనికి వాడినట్లు వెల్లడించారు. ఈ హెల్మెట్ వల్ల చెవులు, తల భాగానికి గాలి తగులుతుందని, తద్వారా గాలి చల్లగా వస్తుందని తెలిపారు. దీనికి రూ.1500 ఖర్చవుతుందని చెప్పారు. దీనికి హెచ్‌ఓడి డాక్టర్ పి.పూర్ణ ప్రియ ప్రోత్సాహం ఉందని విద్యార్థులు బబిత, దుర్గా తేజస్విని, భాగ్య తెలిపారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.నరసింహం, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు అభినందించారు.

కూల్ హెల్మెట్‌తో తయారు చేసిన విద్యార్థులు

మాట్లాడుతున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

17న చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- సబ్బవరం : ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పెందుర్తిలో ఈ నెల 17న జరగనున్న చంద్రబాబు పర్యటన సందర్భంగా జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ సభ అనంతరం రాత్రి చంద్రబాబు పెందుర్తిలో బస చేస్తారని, 18న క్రియాశీల కార్యకర్తలతో సమీక్ష సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం నిర్వహించే సెల్ఫీ విత్ సిబిఎన్ కార్యక్రమంలో కార్యకర్తలందరూ చంద్రబాబుతో సెల్ఫీలు దిగవచ్చని తెలిపారు. కొన్ని సామాజిక వర్గాలకు చెందిన నేతలతో సమస్యలపై ముఖాముఖి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, నాయకులు గండి రవికుమార్, భరణికాన బాబురావు, గండి దేముడు, గండి ముత్యాల నాయుడు, కొటాన అప్పారావు, గొర్లి చైతన్య, సీరం అప్పలరాజు, రేసుపూడి రమణ, అక్కిరెడ్డి దుర్గినాయుడు, పల్లా తాతారావు, ఆడారి నాగరాజు, దాడి కన్నా నాయుడు, ఆకుల గణేష్, పలువురు సర్పంచులు ఎంపిటిసిలు పాల్గొన్నారు.

భక్తుల సొమ్ము దుర్వినియోగం సరికాదు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాజ్యశ్యామలాదేవి యాగం పేరుతో భక్తుల సొమ్ము రూ.10 కోట్లు దుర్వినియోగం చేయడం దారుణమని టిడిపి అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుండి స్పందన లేదని, నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం అట్టర్ ప్లాప్ అయిందని, జగనన్నకు చెబుదాం కార్యక్రమం టోల్ ఫ్రీ నెంబర్ 1902ను పక్కన పెట్టేశారని, ఎప్పుడూ ఎంగేజ్‌లోనే ఉంటుందని, ఈ నేపథ్యంలో జగన్ రెడ్డికి ఓటమి భయం పట్టుకొని ఈ యాగం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ముఖ్యమంత్రి కావాలని ఈ యాగం చేస్తున్నామని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రకటించడం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ నిధులను ఖర్చు చేయాలని ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందని తెలిసి, ఇప్పుడు దేవాదాయ శాఖ నిధులపై జగన్ కన్ను పడిందని విమర్శించారు.

రైల్వే పాస్ ఆన్‌లైన్ విధానం రద్దు చేయాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : వికలాంగుల రైల్వే పాస్ ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాత్రపల్లి వీరు యాదవ్ శుక్రవారం ఎంపీ డాక్టర్ బివి.సత్యవతికి వినతిపత్రం అందజేశారు. ఆన్‌లైన్ విధానాలతో వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు యలమర్తి రవి, కరణం శివ, ముక్కా గణేష్, కాండ్రేగుల నూకఅప్పా రావు, షేక్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుచ్చయ్య పేట : మండలంలోని కందిపూడిలో శుక్రవారం వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా రోగులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 200 మంది రోగులకు పరీక్షలు చేశారు. 52 మందికి కంటి అద్దాలు అవసరాలను గుర్తించారు. 10 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు.

కంటి పరీక్షలు చేస్తున్న వైద్య నిపుణులు

ప్రైవేటు బస్సు ఢీకొని ఇద్దరు యువకులు మృతి

సంఘటనా స్థలంలో గ్రామస్తుల ఆందోళన

సంఘటనా స్థలంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు,

మృతులు కిల్లాడ శ్రీను, కారుకుండి శ్రీను (ఫైల్‌ఫోటోలు)

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని వెదురువాడ వద్ద ప్రధాన రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం ప్రైవేటు బస్సు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని వెదురువాడ గ్రామానికి చెందిన కారుకుండి శ్రీను (25), అచ్చుతాపురానికి చెందిన కిల్లాడి శ్రీను (26) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, వెదురువాడ వద్ద గౌతమ్ ట్రావెల్‌కు చెందిన ప్రైవేట్ బస్సు వెనుకనుంచి వచ్చి వారిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలంలో అధిక రక్తస్రావం జరిగింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో ఒకరు చనిపోగా, ఆసుపత్రికి తరలించేసరికి మరొకరు మృతి చెందారు. సంఘటన స్థలానికి ఎస్ఐ సన్యాసినాయుడు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలంలో గ్రామస్తుల ఆందోళన

బస్సు ఢీకొన్న సంఘటనా స్థలంలో శుక్రవారం సాయంత్రం మృతుల బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మృతి చెందిన ఇద్దరి కుటుంబాలకు న్యాయం చేయాలని రహదారిపై బైఠాయించారు. వారికి జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ మద్దతుగా నిలిచారు.

వేసవి సెలవుల్లో అదనపు పనులు సరికాదు

డిఇఒకు ఫ్యాప్టో నాయకులు వినతి

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి

వేసవి సెలవుల్లో ఎస్సీఈఆర్టీ నిర్దేశించిన బాధ్యతలను, చదువంటే మాకిష్టం కార్యక్రమాలను, పదవ తరగతి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణ వంటి అదనపు పనులు చేయమని ఉపాధ్యాయులను బలవంతం చేయడం సరికాదని ఫ్యాప్టో అనకాపల్లి జిల్లా కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఫ్యాప్టో నాయకులు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ విద్యాశాఖ వెకేషన్ డిపార్ట్మెంట్‌కు చెందినదని, ప్రభుత్వం ఉపాధ్యాయులకు సమ్మర్ వెకేషన్ లేకుండా చేస్తోందని వాపోయారు. సమ్మర్‌లో విధులు నిర్వహించమని అధికారిక ఉత్తర్వులు జారీ చేయకుండానే నోటి మాటగా చెప్పి పని చేయించడం మరీ దారుణమన్నారు. వేసవిలో ఉపాధ్యాయులతో పనిచేయించుకోవాలనుకుంటే వారికి సంపాదిత సెలవులు (ఈఎల్) మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానోపాధ్యాయులకు మూడు సంవత్సరాలుగా సంపాదిత సెలవులు మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు విద్యాశాఖ కమిషనర్, డీఈవోల రాతపూర్వక ఉత్తర్వులు ఇవ్వలేదని, అందువల్ల వేసవి కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కో-చైర్మన్ సిహెచ్.వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ జనరల్ వై.సుధాకర్ రావు, కో- చైర్మన్ సాయి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎన్.సన్యాసి నాయుడు, కార్యవర్గ సభ్యులు వి.శ్రీలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు, కె.రాజు, ఎంవి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు సిఐటియు నేతల పరామర్శ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం సెజ్‌లోని స్పెన్సులెస్ ఫార్మా టెక్ పరిశ్రమలో లిఫ్ట్ రోప్ తెగి తీవ్ర గాయాలై గాజువాక ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న ముగ్గురు కార్మికులను శుక్రవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, జి దేవుడు నాయుడు, అప్పలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస ప్రాంతానికి చెందిన కెమిస్ట్రీ విభాగంలో పనిచేస్తున్న కేశవ కుడికాలు విరిగిపోయిందని, రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్న సిహెచ్ గంగరాజు ఎడమ చేయి చూపుడు వేలు పూర్తిగా తొలగించారని, ఎలమంచిలి మండలం పులపర్తి గ్రామానికి చెందిన ఫిట్టర్‌గా పని చేస్తున్న సూరకాసుల నారాయణరావుకు వెన్నుపూస, కాలు గుత్తి వద్ద గాయాలయ్యాయని తెలిపారు. గాయాలైన కార్మికులు కోలుకునేంతవరకు మెరుగైన వైద్య సేవలు అందించేలా యాజమాన్యం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వారికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా భద్రత ప్రమాణాలు పాటించాలని కోరారు.

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సిఐటియు నేతలు

ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు

ఓపెన్ జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : ఎలమంచిలి పట్టణ పరిధిలో సన్యాసమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్ళ రమకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరేపు గుప్తా, వైసీపీ పట్టణ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్య దొర, కౌన్సిలర్ దాసరి చిన్నమ్మలు కుమార్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డిఎల్‌డిఒ) మంజులవాణి ఆదేశించారు. మండలంలోని రాజుపేట గ్రామంలో జగనన్న లే అవుట్‌ను శుక్రవారం ఆమె సందర్శించారు. అనంతరం లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లే అవుట్ నిర్మాణాల్లో సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. నిర్మాణాలు మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, డిటి వినయ్ కుమార్, ఇఒపిఆర్‌డి పి.ఈశ్వరరావు, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలతో అభివృద్ధి

ప్రజాశక్తి-కశింకోట : డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు అభివృద్ధి చెందాలని ఎపిఎం ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని విసన్నపేటలో గ్రామ సంఘం సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని, సంఘం ఆర్థిక లావాదేవీలు తెలుసుకోవాలని, అప్పులు, పొదుపు ప్రతి నెలా సకాలంలో చెల్లించాలని సూచించారు. వివిధ రకాల పుస్తకాలు నమోదు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిసి అనురాధ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుందని అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్ నగిరెడ్డి సూర్యారావు అన్నారు. అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న శిక్షకులకు శుక్రవారం క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా నలుమూలల సుమారుగా 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఉచితంగా నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నాడ శ్రీనివాసరావు, ఆఫీస్ సిబ్బంది వేణుగోపాల్ పాల్గొన్నారు.

పోషకాహారం పంపిణీలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గర్భిణులు, బాలింతలకు పోషకాహారం పంపిణీ చేయడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండలంలోని తుమ్మపాల సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు సూచించారు. తుమ్మపాల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులను 12 వారాలలో గుర్తించి అందులో ఎవరికైనా ప్రమాదకర పరిస్థితిలో ఉంటే వారికి పోషకాహారం అందించి వారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు రవ్వ శ్రీను, తర్ర సత్యారావు, సచివాలయాల ఎఎన్‌ఎంలు రాజేశ్వరి, జయలక్ష్మి, భారతి, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, అంగన్వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజ్ఞ హర్యాక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోట శ్రీసీతారామ దేవస్థానంలో శనివారం ఉదయం 9 గంటల నుండి జరిగే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో విశాఖ ఓమ్ని ఆర్కే ఆసుపత్రి, శంకర్ ఫౌండేషన్, కుమార్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ అండ్ మ్యాక్ పేస్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జెట్టీ నిర్మాణానికి కలెక్టర్ స్థల పరిశీలన

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల పంచాయతీ శివారు దొండవాక సముద్రతీరం రాజయ్యపేట సముద్ర తీరంలో జెట్టి నిర్మాణంకు శుక్రవారం జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పట్టన్ శెట్టి స్థల పరిశీలన చేశారు. మత్స్యకారులు చేపల వేటకు సంబంధించి ఉపయోగకరంగా ఉండేందుకు జెట్టి మంజూరు అయింది. ఈ మేరకు జెట్టి నిర్మాణంకు సంబంధించి అనుకూలమైన స్థలం గుర్తించేందుకు గాను దొండవాక, రాజయ్యపేట తీరంలో జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పర్యటించారు. ఇందుకు సంబంధించిన భూమిని పరిశీలించారు .స్థలానికి సంబంధించిన మ్యాప్ ను పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు వివరించారు. జెట్టి నిర్మాణానికి సంబంధించి రాజయ్యపేట పంచాయతీ శివారు బోయపాడు, రాజయ్యపేట తీరంలో కేటాయించిన స్థల వివరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి స్థానిక రెవెన్యూ అధికారులు తీసుకువెళ్లారు.రాజయ్యపేట తీరంలో జెట్టి నిర్మాణం చేపట్టాలని ప్రజా ప్రతినిధులు, మత్స్యకారులు కోరారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన

పెదతీనార్లలో జగనన్న లే అవుట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరతగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. లే అవుట్‌లలో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జెడి లక్ష్మణరావు, మండల ప్రత్యేక అధికారి రమామణి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ నీరజ, ఈఓపిఆర్‌డి వెంకట నారాయణ, పెదతీనార్ల సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపిటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మత్స్యకార నాయకులు పిక్కి కామేశ్వరరావు,చందర్రావు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కోటవురట్ల:జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి అరుణశ్రీ అన్నారు. శుక్రవారం సుంకపూరు గ్రామంలో గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ ప్రదేశాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సిబ్బంది వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖరు, పిఓపిఆర్డి ప్రేమ్ సాగర్, పిఆర్ ఇంజనీర్ వర్మ, హౌసింగ్ ఇంజనీర్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న గృహాలు త్వరగా పూర్తయ్యేటట్లు చూడాలని మండల ప్రత్యేకాధికారి కూర్మినాయుడు సూచించారు. శుక్రవారం ఆయన మండలంలో పప్పుశెట్టిపాలెంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లింగందొరపాలెం రెవెన్యూ పరిధిలో చెరువులో పని చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ, జాబ్ కార్డులు ఉన్న ప్రతీ ఒక్కరూ పనులకు హాజర య్యేటట్లు చూడాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలు మండలశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం నాడు నేడు పనులు, ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి రఘురామ్, గృహ నిర్మాణశాఖ ఎఇ మధు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల మండల శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి వితరణ

ప్రజాశక్తి-మాడుగుల:మండలం లోని కెఈ పురం జంక్షన్‌లోని సంతోషి మాత ఆలయంకు శుక్రవారం ఫ్రిజ్‌ను వితరణగా అందజేశారు. ఆలయానికి నిత్య అన్నదానం గత కొన్ని సంవత్సరాలుగా జరుగు తుండగా ఇంటర్నేషనల్ ఆర్య వైశ్య సంఘం కే జే పురం అధ్యక్షులు శ్రీనాథు శేఖర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కాళ్ళ అమ్మ తల్లి నాయుడు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని అమలాపురం లో గోసల సురేష్‌కు చెందిన మేక విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మ్ వద్ద మేక మేత మేస్తుండగా విద్యుత్ షాక్ గురై మృత్యువాత పడిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ట్రాన్స్ ఫార్మ్ ను మరో చోటుకు మార్చాలని డిమాండ్ చేశాడు.

మృతి చెందిన మేక

రహదారి విస్తరణకు సర్వే

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: పట్టణంలో అభీద్ సెంటర్ నుండి పెద్ద బొడ్డేపల్లి పెద్ద మధుం వరకు ప్రధాన రహదారి విస్తరణ పనుల నిమిత్తం శుక్రవారం సచివాలయ సిబ్బంది తుది కొలతలు వేశారు. రోడ్డు విస్తరణ పై ఇప్పటివరకు పంపిన ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. గతంలోనే రహదారి విస్తరణకు ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. రహదారి విస్తరణకు ఇటీవల సీఎం జగన్ శంకుస్థాపన చేసిన దగ్గర నుండి విస్తరణ పనులు పరిగెడుతున్నాయి. ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ కృషితో రహదారి విస్తరణ 100 జరగాలనే ప్రతిపాదనలు అమలవుతున్నాయి. భవన యజమానులతో రెండుసార్లు మున్సిపాలిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. 80 అడుగుల రోడ్డు విస్తరణ చేయాలని షాపు యాజమాన్యం, వ్యాపారస్తులు అసోసియేషన్ సభ్యులు పట్టుబట్టారు. అయినా మున్సిపాలిటీ అధికారులు, పాలకులు ఒక మెట్టు దిగకుండా టిడిఆర్ బాండ్లు ఇవ్వడానికి మాత్రమే సిద్ధంగా ఉన్నారు. ఇటీవల ఉపగ్రహ సర్వేతో వెడల్పునకు ప్రతిపాదించిన కొలతలు తొలగించాల్సిన భవనాలపై మార్కింగ్ పనులను పూర్తి చేశారు. వీటన్నింటితో రూపొందించిన రోడ్డు అబివద్ధి ప్లాన్ ఆమోదం పూర్తి అవ్వడంతో పనులకు మార్గం సుగమమైంది.

సర్వే చేపడుతున్న సిబ్బంది

నోటీసులు ఇచ్చి భవనాల తొలగింపు

బాధితులకు పరిహారంగా టీడీఆర్ ధ్రువపత్రాలకు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలి. దీనిపై కౌన్సిల్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించింది. తదుపరి ప్రక్రియకు సన్నాహాలు చేస్తున్నాం. ముందుగా ఆర్డీడీ అనుమతి, భవనాలను తొలగించడానికి గడువు తదితర విషయాలను తెలియజేసేందుకు ముందుగానే తెలియజేస్తాం. అనంతరం వీటిపై సలహాలు, సూచనలు తెలియజేసేందుకు రెండుసార్లు సమావేశాలు ఏర్పాటు చేశాం. ఆ తర్వాతే నోటీసులు జారీ చేసి భవనాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

కనకరావు,
మున్సిపల్ కమిషనర్, నర్సీపట్నం

దళితులపై దాడి చేసిన.. నిందితులను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: బలిఘట్టంలో మరిడమ్మ పండుగ సందర్భంగా దళిత యువకుల పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల డివిజన్ నాయకులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన దళితులతో కలిసి బలిఘట్టం బాధితులతో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టి నినాదాలు చేసారు. ఈ విషయంపై న్యాయం జరగకపోతే సోమవారం ఆర్డిఓ కార్యాలయంను ముట్టడిస్తామన్నారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధి బలిఘట్టంలో జరిగిన జాతరలో దళిత యువకులు దళాయి మహేష్, దుర్గాప్రసాద్, సత్తిబాబులపై విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచిన సుర్ల నాయుడు, అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ నాయకులు చిరంజీవి మాట్లాడుతూ, నర్సీపట్నం డివిజన్లో దళితులపై దాడులు అధికంగా జరుగుతున్నాయని, అట్రాసిటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడమే దీనికి కారణమన్నారు. రెల్లి యూత్ అధ్యక్షులు కోన నారాయణరావు మాట్లాడుతూ, అట్రాసిటీ కేసులను పోలీసులు విచారణతోనే సరి పెడుతున్నారన్నారు. నాగేశ్వరరావు, మరిడియ్య, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు

సిబిఎస్ఇ ఫలితాలలో

శ్రీ ప్రకాష్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి -పాయకరావుపేట:సి.బి.ఎస్.ఈ. పదవ తరగతి ప్లస్2 ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు సత్తా చాటారు. పదవ తరగతి ఫలితాలలో 500 మార్కులకు గాను సాయి సౌమ్య 490, ఏ.ఎస్.డి మహాలక్ష్మి 487, బి.కీర్తన 483, కె.హేమంత్ 482, జోషిత 479 మార్కులతో అగ్రగామిగా నిలిచారు.

ప్లస్2 ఫలితాలలో బై.పి.సిలో 464 మార్కులతో ప్రత్యూష్ ప్రధాన్, ఎం.పి.సి లో ఎన్. సూర్య చరణ్ - 460, ఎస్.అశోక్ 452 మార్కులు సాధించి సత్తా చాటారు. 88శాతం విద్యార్థులు ప్రధమశ్రేణి లో ఉత్తీర్ణులవడమే కాకుండా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి. వి.ఎస్. మూర్తి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ఎస్ భానుమూర్తి, తల్లిదండ్రులు అభినందించారు.

గ్రామాల్లో స్ప్రేయింగ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి -కొత్తకోట:కీటక జనిత వ్యాధులు రాకుండా గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్ చేయాలని హెల్త్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథం సూచించారు. ముందు జాగ్రత్తగా దోమల నివారణ మందు ఎసిఎం 5శాతం మందు స్ప్రేయింగ్ చేయాలన్నారు. శుక్రవారం కొత్తకోట పిహెచ్‌సి పరిధిలో ధర్మవరం గ్రామంలో జరుగుతున్న స్ప్రేయింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరి గ్రామాలలో ఎక్కువగా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రతి గిరి గ్రామంలోనూ ఎసిఎం 5శాతం మందు స్ప్రేయింగ్ చేయించాలని హెల్త్ సూపర్వైజర్ మల్లిబాబుకు సూచించారు. దోమతెరలు వాడాలని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా సమీప ఆరోగ్యకేంద్రానికి వెళ్ళి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కె.వరహాలుదొర, సబ్ యూనిట్ ఆఫీసర్ మురళీకృష్ణ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్

శంకుస్థాపన చేస్తున్న నేతలు, సిబ్బంది

తాగునీటి పథకానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని కెజె పురంలో శుక్రవారం మంచినీటి పథకంకు వైసిపి నాయకులు శంకుస్థాపన చేశారు. ఇంటింటికీ మంచి నీరు సరఫరా పథకానికి ఉప ముఖ్యమంత్రి 3.30 కోట్ల రూపాయలు మంజూరు చేయగా, 40 వేల లీటర్ల సామర్థ్యం గల మంచి నీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు అడారి కన్న, జామి రమణ బాబు, కాళ్ళ రాము, యల్లపు శ్రీను, మల్ల కన్నబాబు, కాళ్ళ అమ్మతల్లి నాయుడు, సూరిశెట్టి అచ్చిం నాయుడు, కాళ్ళ జగన్, సూరిసెట్టి గోవింద్, ఆదారి వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి శివ, ఇంజనీరింగ్ సిబ్బంది స్వాతి, కిరణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం నీలిబంద గ్రామంలో సమస్యలు పరిష్కరించి, ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు ఇవ్వాలని శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పిత్రిగడ్డ శివారు గ్రామమైన నీలిబంద గ్రామంలో ఆరు కుటుంబాలు 25 మంది జనాభా కొందుతెగ చెందినటువంటి గిరిజనులు జీవనం సాగిస్తున్నారన్నారు. శరభవరం సచివాలయం పరిధిలో శివారు గ్రామమైన 15కిలోమీటర్ల దూరం ఎత్తైన కొండల మధ్య జీవనం సాగిస్తున్నారన్నారు. దట్టమైన అడవి మధ్యల్లో చీకట్లో బతుకు తున్నారన్నారు. వీరు ప్రధానంగా జీడిమామిడి తోటల పై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. గ్రామంలో కరెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలని, మంచినీరు కోసం రెండు కిలోమీటర్ల దూరం ఎత్తైన కొండల మధ్య కర్ర ఒక సాయంతో నీరు తెచ్చుకొని బతుకుతున్నారన్నారు. రేషన్ బియ్యంకు 15 కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకోవాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామంలో ఇద్దరికి వృద్ధాప్య పెన్షన్లు ఇస్తున్నారని, నగదు తీసుకునేందుకు డోలు కట్టుకొని లోసింగి గ్రామానికి వెళ్లాలన్నారు. పనులు లేక పోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ గ్రామాన్ని సందర్శించి వీరికి ఉపాధి పథకం పనులు కల్పించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్ ప్రాంతం కావడంతో గిరిజనులంటే అధికారులు పట్టించు కోలేదన్నారు. ఇప్పటికైనా కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్ర కొండబాబు, కొర్ర కృష్ణ, గంబిల అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత గోవిందరావు

మాట్లాడుతున్న చిరంజీవి

ఉపాధి బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-రోలుగుంట:ఉపాధి హామీ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నేత ఈరెల్లి చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం రోలుగుంట మండలంలో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు బడ్జెట్‌లో నిధులు తగ్గించడం అన్యాయమన్నారు. గతంలో రెండు లక్షల కోట్లు కేటాయించగా ఇప్పుడు 16 వేల కోట్లు కేటాయించడం అన్యాయమన్నారు. ఉపాధి కూలీలకు నిధులు బడ్జెట్‌లో పెంచాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మజ్జిగ, మెడికల్ కిట్లు, టెంట్ సౌకర్యాలు కల్పించాలని, 200 రోజులు పని దినాలు ఇవ్వాలని, 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వినతులు పరిశీలిస్తున్న అధికారులు

స్పందన అర్జీల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి -కోటవురట్ల:స్పందన పెండింగ్ అర్జీల సత్వర పరిష్కారం కోసం శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జానకమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, స్థానిక ఎస్ఐ నారాయణరావు, పలు సమస్యలు పిటిషనర్ల సమక్షంలో పరిష్కరించారు. చౌడువాడ గ్రామంలో భూ సమస్య పై అర్జీదారుల సమక్షాన సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అదే విధంగా జల్లూరు గ్రామానికి సంబంధించి బాట విషయమై ఏర్పడిన సమస్యను కూడా పరిష్కరించడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం ఉన్నందున, ఆ దిశగా కృషి చేస్తామని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఆర్డి ప్రేమ్ సాగర్, పిఆర్ ఇంజనీర్ వర్మ, సర్వేయర్ వరప్రసాద్, ఏపీవో గంగు నాయుడు పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న అటవీశాఖ సిబ్బంది

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ:పర్యావరణాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కెడిపేట అటవీ శాఖ రేంజ్ అధికారి సుంకర వెంకటరావు సూచించారు. కృష్ణదేవిపేట సమీపంలో నల్లగొండ గ్రామంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణపై అటవీ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన చింతపల్లి ఎఎంసి ఛైర్మన్ జైతి రాజులమ్మ మాట్లాడుతూ, అడవులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వీఆర్వో రాజేష్, సెక్షన్ అధికారి లక్ష్మణ్, గార్డు ఎరుకులమ్మ పాల్గొన్నారు.

హెటిరోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కలెక్టర్‌తో మాట్లాడుతున్న అప్పలరాజు, తదితరులు

ప్రజాశక్తి -నక్కపల్లి :హెటిరో రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించిపోతుందని, దీని కారణంగా జీవనోపాధిని కోల్పోతున్నామని జిల్లా కలెక్టర్ రవి సుభాష్ పట్టన్ శెట్టి ఎదుట మత్స్యకారులు ఆవేదన వెలిబుచ్చారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దొండవాక మీదుగా రాజయ్యపేట వెళుతుండగా మత్స్యకారులు చేపడుతున్న ఆందోళన శిబిరం వద్ద జిల్లా కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో మత్స్యకారులు వినతిపత్రం అందజేశారు. కంపెనీ కొత్తగా వేస్తున్న పైప్ లైన్‌కు వ్యతిరేకంగా 523 రోజుల నుండి తామంతా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ వ్యర్థ రసాయన జలాలను పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి, శుద్ధి చేయకుండా సముద్రంలోకి వదలడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని, దీంతో ఉపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో వేట సాగకపోవడంతో వలసలు పోవడం జరుగుతుందన్నారు. కొత్తగా పైపులైన్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని, ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన పరిస్థితులు నెల కొంటాయని ఆవేదన వెలిబుచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ, పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ ను ఆశ్రయించడం జరిగిందన్నారు. హెటిరో డ్రగ్స్ యాజమాన్యం న్యాయ స్థానాలకు, అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పించుకుంటుందని విమర్శించారు. రాజయ్యపేట సర్వే నెంబర్ 291 లో 400 ఎకరాలు ఉప్పుటేరు ఉందని దీనిని పూడిక తీయించి నీరు నిల్వ ఉండేటట్లు గా చేస్తే వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఉప్పుటేరులో చేపలు పట్టుకుని జీవనోపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఉప్పుటేరులో పూడిక తీత పనులు చేయించాలని కోరారు. రాజయ్యపేట సముద్ర తీరంలో ఫిషింగ్ జెట్టి నిర్మించాలని, గ్రామం మొత్తంలో సగానికి పైగా ఫారెస్ట్ భూమి ఉందని, ఇళ్లు నిర్మించుకోవాలంటే ఇంటి పట్టా (ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్) ఇవ్వడం లేదని, దీని కారణంగా పేదలు ఇల్లు నిర్మించుకోలేక పోతున్నారని పట్టాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గోసల కాసులమ్మ, మత్స్యకార నాయకులు పిక్కి కామేశ్వరరావు, పిక్కి సత్తయ్య, గోసల సోమేశ్వరరావు, వాసిపిల్లి నూకరాజు, పిక్కి గంగరాజు, మైలపల్లి మహేష్ బాబు, చేపల సోమేష్, మైలపల్లి జాన్, వాసుపిల్లి శివ, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పుపై సర్వత్రా హర్షం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 1ని ఏపీ హైకోర్టు రద్దు చేయడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, మునుపెన్నడు లేని విధంగా జీవో 1ని వైసిపి ప్రభుత్వం తెచ్చి ప్రతిపక్షాల గొంతు నొక్కే విధంగా కక్ష సాధింపు చర్యలు పూనుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలో సభలు, రోడ్ షోలు, ర్యాలీలపై ఆంక్షలు విధిస్తూ జీవో 1 తేవడం అన్యాయమని తెలిపారు. దీనిపైన సిపిఎంతో పాటు మిగతా వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద పోరాటాలు చేశాయన్నారు.జీవో 1ని రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు తీర్పు ఇవ్వడం శుభపరిణామన్నారు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అనకాపల్లి:ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తీసుకువచ్చిన అప్రజాస్వామిక జీవో నెంబర్ 1ను హైకోర్టు రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆ జిఒ కాపీలను శుక్రవారం టిడిపి కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీష్ మాట్లాడుతూ జగన్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యాలను, వేసే భారాలను, చేస్తున్న దోపిడీలను ప్రతిపక్షాలు రోడ్డు షోలు, ప్రదర్శనలు, ర్యాలీల ద్వారా బయట పడతాయనే భయంతో జీవో 1ను తీసుకొచ్చారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, మాదంశెట్టి నీలబాబు, ధనాల విష్ణుచౌదరి, కుప్పిలి జగన్, కోట్ని రాంబాబు, కోట్ని రామకృష్ణ, సూరే సతీష్ పాల్గొన్నారు.

వడ్డాది : ప్రతిపక్షాల గొంతు నొక్కాలని వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 1ని హైకోర్టు కొట్టివేయడం శుభ పరిణామమని టిడిపి చోడవరం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు అన్నారు. బుచ్చయ్య పేట మండలం వడ్డాదిలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్నారు. చంద్రబాబు, లోకేష్ బహిరంగ సభలు, పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే జగన్ ఈ జిఒ తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోకివాడ కోటేశ్వరరావు గొన్నబత్తుల శ్రీనివాసరావు, శిరగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, శేషు పాల్గొన్నారు.

నక్కపల్లిలో కృత్యాలను చూపుతున్న విద్యార్థులు

కొనసాగిన వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా వెటర్నరీ అసిస్టెంట్ జోగేశ్వరరావు వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి జనార్దన్ తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్:స్థానిక ఐదు రోడ్ల జంక్షన్లో శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా వైద్య వృత్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక ప్రాంతీయ వైద్యాలయం నుండి స్టాఫ్ నర్స్ సుందరి, కె.సూర్యకుమారి ఈ కార్యక్రమంలో శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలను వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు సుబ్బారావు విద్యార్థులకు ఫ్లోరెన్స్ జీవిత చరిత్రను వివరించారు. అనంతరం పిల్లలతో పద్యాలు, పాటలు, పాడించారు. గ్రంథాలయధికారి పి.దమయంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గొలుగొండ:వేసవి విజ్ఞాన శిబిరం సందర్భం గా గొలుగొండ శాఖగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం బుక్ రీడింగ్, నీతి కథలు చెప్పడం, పద్యములు చెప్పుట, డ్యాన్స్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు విద్యార్థులు పాల్గొనగా రీసోర్స్ పర్సన్‌గా రామకృష్ణ మాస్టారు వ్యవహరించారు.

కోటవురట్ల:విద్యార్థులు ప్రతిరోజు ఏదో ఒక పుస్తకాన్ని పటిస్తూ ఉంటే విషయం పట్ల పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చునని శాఖ గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు అన్నారు. వేసవి విజ్ఞానం శిబిరంలో భాగంగా పుస్తక పఠనం నిర్వహించారు.

సబ్బవరం:స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పుస్తక పఠనం, హ్యాండ్ రైటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి వి.శిరీష మాట్లాడుతూ పుస్తక పఠనం వలన విజ్ఞానాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఆనందపురం: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బివిఎస్ అప్పారావు ఆధ్వర్యంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఎఎంసి మాజీ సభ్యుడు కొట్యాడ రెడ్డిబాబు గ్రంథాలయాన్ని సందర్శించారు. చిన్నారులు వివిధ రకాల పుస్తకాలను ఎంతో ఆసక్తిగా తిలకించారు. మేజిక్ బస్సు ఆర్గనైజేషన్ యూత్ మెంటార్ టి. ఆదిలక్ష్మి, కె. రమణమ్మ విద్యార్థులతో ఆటలాడించి, ఆరోగ్యసూత్రాలను వివరించారు.

సింహాచలం: అడివివరం శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం చిన్నారులకు పుస్తక పఠనంతో పాటు ఆటల పోటీలు నిర్వహించారు.. గ్రంథాలయాధికారి ఎన్‌వి నరసింహం, బిబి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో చిన్నారులకు వినోదం కలిగించే విధంగా నాటక పోటీలు నిర్వహించారు.